

పీలేరు బహిరంగ సభకు హాజరైన జనం

ప్రజలకు చంద్రబాబు అభివాదం

# పాపాల పెద్దిరెడ్డీ.. ఎలా గెలుస్తావో చూస్తా

- ఇంత కాలం నా దయాదాక్షిణ్యాలతో గెలిచావ్
- ఇసుక దందా, ప్రభుత్వ భూముల కబ్జాల్లో ఆరితేరిన వైసీపీ ఎమ్మెల్యేలు
- అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా జగన్ పట్టించుకోలేదు
- వైసీపీ వైఫల్యాలు ప్రజలకు వివరించాలి
- అధికారంలోకి రాగానే మదనపల్లె జిల్లా ఏర్పాటు
- పీలేరు సభలో చంద్రబాబు నాయుడు

పీలేరు, జనవరి 27: 'పాపాల పెద్దిరెడ్డీ.. ఇంత కాలం నా దయాదాక్షిణ్యాలతో గెలుస్తూ వచ్చావ్. వచ్చే ఎన్నికల్లో నా తడాఖా చూపిస్తా. ఇకపై పుంగనూరులో ఎలా గెలుస్తావో చూస్తా' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు.

రాజంపేట పార్లమెంటు పరిధిలోని పీలేరులో శనివారం జరిగిన 'రా..కదలిరా' బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఆది నుంచి కట్టుబడి ఉన్నది కేవలం టీడీపీయేనని, ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీ ప్రభుత్వం ఉన్నన్నాళ్లూ రాయలసీమ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. దివంగత నందమూరి తారక రామారావు మానస పుత్రికలుగా తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు ఆవిర్భవించాయన్నారు. నీళ్లు ఉంటేనే రాయలసీమ అభివృద్ధి చెందుతుందన్న ఆలోచనతో ఆ ప్రాజెక్టులను రామారావు ప్రారంభిస్తే తాను ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లూ వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అందులో భాగంగానే టీడీపీ హయాంలో రాయలసీమ అభివృద్ధికి రూ.12,500 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. గోదావరి నీటితో రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న దృఢసంకల్పంతో యుద్ధప్రాతిపదికన పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తెచ్చానన్నారు. అక్కడి నుంచి 120 టీఎంసీల గోదావరి నీటిని రాయలసీమలోకి తెచ్చిన ఘనత కూడా టీడీపీదేనన్నారు. ప్రతి ఏటా సముద్రంలో కలిసిపోయే 2 వేల టీఎంసీలను రాయలసీమకు తరలించేందుకు బానకచర్ల ద్వారా సీమకు తరలించేవాళ్లమని, అధికారం కోల్పోవడంతో ఆ అవకాశం కోల్పోయామన్నారు. రాయలసీమను పండ్ల తోటలకు హబ్‌గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేశానని, అందులో భాగంగానే డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించి దానికి 90 శాతం సబ్సిడీ అందించానన్నారు. దురదృష్టవశాత్తు గత ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ పథకాలన్నీ అటకెక్కిపోయాయని తెలిపారు. తనను రాయలసీమ బిడ్డగా చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంత ప్రాజెక్టులు పూర్తి చేయడానికి గడిచిన ఐదేళ్లలో ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రాజెక్టుల గురించి ఏనాడూ పట్టించుకోని జగన్ చరిత్రలో రాయలసీమ ద్రోహిగా మిగిలిపోతారన్నారు. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె అసెంబ్లీ సెగ్మెంట్లలో అధికంగా ఉన్న టమోటా రైతుల కోసం పీలేరులోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో టమోటా ప్రాసెసింగ్, పల్ప్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## అన్నమయ్య ప్రాజెక్టుకు గ్రీసు కూడా పెట్టలేని సీఎం

కడప, అన్నమయ్య జిల్లాలకు తలమానికంగా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా పట్టించుకోలేదన్నారు. ఆ ప్రాజెక్టు ముంపులో 40 మంది ప్రాణాలు కోల్పోయినా, 450 మంది ఇళ్లు నేలమట్టమైనా ఆయనలో చలనం లేకపోయిందన్నారు. ఆ ప్రాజెక్టు కొట్టుకుపోయి ఏళ్లు గడుస్తున్నా నిర్వాసితులకు ఇళ్లు కూడా నిర్మించి ఇవ్వలేని అసమర్థుడని విమర్శించారు. చివరకు ఆ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ప్రతి ఒక్కరికీ రూ.లక్ష అందించి ఆదుకున్నామని గుర్తు చేశారు.

## అక్రమార్జనే వారి లక్ష్యం

అన్నమయ్య జిల్లాలోని ప్రజాప్రతినిధులందరూ అక్రమార్జనే ధ్యేయంగా ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు మంగంపేట బెరైటీస్ గనుల్లో కుంభకోణాలు చేశారన్నారు. రాయచోటి ఎమ్మెల్యే భూఆక్రమణలు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ప్రభుత్వ భూములు, ఇసుక.. పీలేరు ఎమ్మెల్యే ఇసుక, క్వారీలు, భూఆక్రమణల్లో మునిగితేలుతున్నారన్నారు. పుంగనూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనునిత్యం కుంభకోణాలు జరుపుతూ సుమారు రూ.35 వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. ఆయన ఉదయం అల్పాహారంగా ఇసుక, మధ్యాహ్నం భోజనంలో గనులు, రాత్రి భోజనంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల్ని మింగేస్తున్నారన్నారు. ఆవులపల్లె ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రభుత్వం నుంచి ఆయన పీఎల్ఆర్ సంస్థ అడ్వాన్సుగా రూ.600 కోట్లు తీసుకుందని, తీరా ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవని సుప్రీంకోర్టు అక్షింతలు వేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు జరిమానా కట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించగా చచ్చీ చెడి ప్రభుత్వం రూ.25 కోట్లు కట్టిందన్నారు. పెద్దిరెడ్డి మాత్రం తాను తీసుకున్న రూ.600 కోట్ల గురించి మాట్లాడడం లేదన్నారు. పెద్దిరెడ్డి కుప్పం వెళ్లి తనను ఓడిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడని అన్నారు. ఇంతకాలం తన దయాదాక్షిణ్యాలపై పెద్దిరెడ్డి గెలుస్తూ వచ్చారని, వచ్చే ఎన్నికల్లో పుంగనూరులో ఓడించి తన తడాఖా ఏమిటో ఆయనకు రుచి చూపిస్తానన్నారు. తనతో పాటు రాజంపేట ఎంపీ, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పదవులను తన ఇంట్లో పెట్టుకుని తాలిబాన్ నియంతలా మారిపోయాడని, వచ్చే ఎన్నికల్లో ఆ ముగ్గురినీ చిత్తుచిత్తుగా ఓడించాలని చంద్రబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మద్యపాన నిషేధం అమలులో మాట తప్పిన జగన్



సంపూర్ణ మద్యపాన నిషేధం తెస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక మరో 25 ఏళ్ల పాటు దాని ఊసెత్తలేని విధంగా మద్యం అమ్మకాలను గ్యారెంటీగా చూపించి రూ.36 వేల రుణం తెచ్చుకున్నారన్నారు. చిన్నచిన్న బడ్డీ కొట్లలో కూడా ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతుంటే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రం వాటిని ఏర్పాటు చేయలేదన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకోలేని జగన్‌కు ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. ఇక ఆయన అమలు చేసే సామాజిక న్యాయంలో నేతి బీరకాయలో నేయి చందంగా ఉంటుందన్నారు.

## మదనపల్లె జిల్లా ఏర్పాటు

అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లె కేంద్రంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాలతో కలిపి జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. జగన్ నేతృత్వంలో జిల్లాల విభజన శాస్త్రీయంగా, ప్రజల ఆకాంక్షల మేరకు జరగలేదన్నారు. కేవలం తన అనుచరులకు అనుకూలంగా జిల్లాలను విభజించారని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షల మేరకు తాము మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పీలేరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా పథకం పనులు పూర్తి చేసి సుమారు 70 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో గతంలో డ్రిప్ పరికరాలపై 90 శాతం సబ్సిడీ ఇచ్చామని, తాము అధికారంలోకి రాగానే డ్రిప్ ఇరిగేషన్‌లో వినియోగించే ఎరువులపై కూడా సబ్సిడీ అందిస్తామన్నారు.

## సైకో పాలనకు తెరదించాలి


జగన్ సైకో పాలనను తెరదించే సమయం ఆసన్నమైందని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. ఎన్నికలకు సిద్ధం అంటూ జగన్ ప్రజల్లోకి బయలుదేరాడని, గడిచిన నాలుగున్నరేళ్లలో ఏనాడూ తాడేపల్లె ప్యాలెస్ గడప దాటని జగన్, మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నాడన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, కంచెర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌యాదవ్, రాటకొండ సాగర్‌రెడ్డి, ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి, జి.ద్వారకనాథరెడ్డి, దొమ్మలపాటి రమేశ్, షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు లింగారెడ్డి, కడప జిల్లా జడ్పీ మాజీ చైర్మన్, రాజంపేట పార్లమెంట్ నాయకుడు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, చల్లా రామచంద్రారెడ్డి, రాటకొండ బాబురెడ్డి, రాటకొండ గురుప్రసాద్, పర్వీన్‌తాజ్, గంటా నరహరి, పంతగాని నరసింహప్రసాద్, సుగవాసి ప్రసాద్‌బాబు, ఇంతియాజ్ అహ్మద్, మల్లెల రెడ్డిబాషా, ఎన్.శ్రీనాథరెడ్డి, గాజుల ఖాదర్‌బాషా, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ముక్కా రూపానందరెడ్డి, మేడా విజయశేఖర్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్, మద్దిపట్ల సూర్యప్రకాశ్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, చంద్రారెడ్డి, హేమచంద్రారెడ్డి, బందార్లపల్లె బాబురెడ్డి, సహదేవ, శ్రీనివాసులు, చంద్రారెడ్డి, కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, వసంతాల రాజా, జనసేన నాయకులు బెజవాడ దినేశ్, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో టీడీపీ సభ విజయవంతం

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు అందరి సమన్వయంతో సమిష్టి కృషి చేయడంతో పీలేరులో జరిగిన చంద్రబాబునాయుడు సభ విజయవంతమైంది. సుమారు పది రోజులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌తో కలిసి ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేశాము. జిల్లాలోని అందరు నాయకులను కలుపుకుని ఊహించిన దానికంటే జన సమీకరణ చేయగలిగాము. లక్షకు పైగా ఈ సభకు జనం హాజరయ్యారు. రాజంపేట అసెంబ్లీ నుంచి ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేసి సుమారు 20 వేల మందికి పైగా జనాన్ని తరలించాము. ఎటువంటి ఆటంకాలు కలగకుండా సభ విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.







కట్టలు తెంచుకున్న అభిమానం

మిద్దెలెక్కి చంద్రబాబు ప్రసంగాన్ని వింటున్న జనం





సభకు హాజరైన మహిళలు



చంద్రబాబుతో పాటు బస్సు నుంచి దిగుతున్న జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం



పాటలు పాడుతున్న కళాకారులు



## పీలేరు సభకు పోటెత్తిన జనం

- లక్షకు పైబడి జనం రావడంతో ఉక్కిరిబిక్కిరైన టీడీపీ వర్గాలు

పీలేరులో శనివారం జరిగిన రా.. కదలిరా సభకు హాజరైన జన సందోహం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సహా మొత్తం టీడీపీ వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. అనూహ్య రీతిలో ప్రవాహంలా వచ్చిన జనాన్ని చూసి చంద్రబాబు కూడా ఒక దశలో ఉక్కిరిబిక్కిరయ్యారు. జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో అంతకుమించి జనం సమీపంలోని జాతీయ రహదారిపై ఆగిపోవలసి వచ్చింది. హెలికాప్టర్‌లో వస్తూ చంద్రబాబు కూడా రోడ్డు వెంట కిలోమీటర్ల కొద్దీ బారులు తీరిన జనాన్ని గమనించారు. ఆ విషయాన్ని సభలో సైతం ఆయన పదే పదే ప్రస్తావించారు. లక్షలాదిగా హాజరైన జనప్రభంజనమంటూ ఆయన ప్రసంగాన్ని ఆవేశంగా కొనసాగించారు. ఇదేరోజు సిద్ధం పేరుతో జగన్ నిర్వహిస్తున్న సభను ప్రస్తావిస్తూ 'లక్షలాది జనం ముందు చెబుతున్నాం.. మేము యుద్ధానికి సిద్ధం' అని ప్రతి సవాల్ విసిరారు. యుద్ధానికి సిద్ధమేనా.. సిద్ధమైతే చప్పట్లు కొట్టమన్నారు. పెద్ద ఎత్తున ప్రజల నుంచి స్పందన లభించింది. పీలేరు నుంచి మదనపల్లెకు వెళ్లే జాతీయ రహదారి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా వాహనాలు, అందులో వచ్చిన జనంతో రవాణా దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.



వేదికపై చంద్రబాబుతో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నల్లారి కిశోర్



వేదికపై మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టీడీపీ నాయకులు పర్వీన్‌తాజ్, ముక్కా రూపానందరెడ్డి



చంద్రబాబు హెలికాప్టర్‌ను అనుసరిస్తున్న డ్రోన్



వేదికపై టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, పంతగాని నరసింహప్రసాద్

# జన.. ప్రభంజనం...

## పీలేరు సభకు పోటెత్తిన ప్రజలు

పీలేరు, జనవరి 27 : పీలేరులో శనివారం జరిగిన రా.. కదలిరా సభకు లక్షకు పైగా జనం రావడంతో జన.. ప్రభంజనంలా మారింది. జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో అంతకుమించి జనం సమీపం లోని జాతీయ రహదారిపై ఆగిపోవలసి వచ్చింది. పీలేరు నుంచి మదన పల్లెకు వెళ్లే జాతీయ రహదారి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా వాహనాలు, అందులో వచ్చిన జనంతో రవాణా దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.



## వైసీపీ అరాచక పాలన అంతమే ధ్యేయం

**రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు**



రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక, విధ్వంస పాలన అంతమే తమ ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. పీలేరులో జరిగిన 'రా...కదలిరా' సభలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా వైసీపీ నాయకుడు పెడుతున్న అనేక అక్రమ కేసులు ఎదుర్కొంటూ కూడా పార్టీ పట్ల నమ్మకం కలిగి ఉన్న కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలన కారణంగా అభివృద్ధిలో 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పీలేరు సభకు హాజరైన జనసమూహాన్ని చూసి తాడేపల్లె ప్యాలెస్‌లోని జగన్, పుంగనూరు పుడంగి పెద్దిరెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయన్నారు. అధికారంతో గత నాలుగేళ్లుగా మద్యం, ఇసుక అక్రమ వ్యాపారాల్లో సంపాదించిన డబ్బు సంచులతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ నాయకులు వస్తారని వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు సీటుతో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## ల్యాండ్, శ్యాండ్, మైన్‌తో వైసీపీ దోపిడీ

**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్**



వైసీపీ వారు ల్యాండ్, శ్యాండ్, మైన్-వైన్‌లతో రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పీలేరు సభలో ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప వైసీపీ పాలనలో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టలేరన్నారు. పీలేరు నియోజకవర్గంలోని యువత కోసం తాము ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సుమారు 2 వేల ఎకరాలు సేకరిస్తే వాటిలో పరిశ్రమలు స్థాపించకుండా ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పెద్దిరెడ్డి అన్యాయం చేశారన్నారు. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరిచ్చే ఝరికోన ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదన్నారు. రాజంపేట ఎంపీ స్థానంతో పాటు దాని పరిధిలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలను టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. తమ కుటుంబంపై ఎనలేని ప్రేమ, అభిమానం చూపిస్తున్న పీలేరు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగానికి లోనయ్యారు. పీలేరు సభను విజయవంతం చేసిన రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల టీడీపీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలే జగన్‌ను ట్రాన్స్‌ఫర్ చేస్తారు

**● కంచెర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ**



ఎమ్మెల్యేలు, ఎంపీలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు త్వరలో రాష్ట్రం నుంచి ట్రాన్స్‌ఫర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. నా వెంట్రుక కూడా పీకలేరని డాంబికాలు పలికిన జగన్, ప్రస్తుతం జనాగ్రహాన్ని గ్రహించి సంతోషంగా దిగిపోతానని ఓటమిని అంగీకరిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

**పసుపులేటి హరిప్రసాద్, జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు**



దేశానికే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్ గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చివేశారు. దేశంలో ఎక్కడ గంజాయి కేసులు బయటపడినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో తేలుతున్నాయన్నారు. ఆయన నేతృత్వంలోని వైసీపీ గంజాయి, ఎర్రచందనం, లిక్కర్, ఇసుక మాఫియాగా మారిపోయిందని, ముఖ్యమంత్రి జగన్ మాఫియా డాన్‌గా మారిపోయారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేస్తారని అన్నారు.

## నాతోనే అంతమవుతావ్

**చల్లా రామచంద్రారెడ్డి, పుంగనూరు**



'1989లో నాపై గెలిచి రాజకీయ జీవితం ప్రారంభించావ్, ఈ ఎన్నికల్లో నా చేతుల్లో ఓడిపోయి రాజకీయంగా అంతమైపోతావ్' అంటూ మంత్రి పెద్దిరెడ్డిపై పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) పీలేరు సభలో ఫైర్ అయ్యారు. పీలేరు సభను చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నులో వణుకు పుట్టిస్తోందన్నారు. పీఎల్ఆర్ సంస్థ పేరుతో రైతులకు ఒక్కరూపాయి నష్టపరిహారం చెల్లించకుండా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వారిద్దరి అధికారం అంతం అయ్యే సమయం ఆసన్నమైందన్నారు.

## చంద్రబాబు సభలో హైలైట్స్

కలికిరి/కలకడ, జనవరి 27: శనివారం పీలేరులో జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భారీ బహిరంగ సభ అనుకున్నదానికి మించి విజయవంతమైంది. రాజంపేట పార్లమెంటు పరిధిలో జరిగిన ఈ సభకు రాజంపేట, కోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నుంచి జనాలు హాజరయ్యారు. లక్షకు పైబడి జనం హాజరయ్యారని చెబుతుండగా అందులో సగం మంది జాతీయ రహదారిపై ఏడెనిమిది కిలోమీటర్ల మేర ఇరుక్కుపోయారు. మొత్తానికి జనసందోహాన్ని చూసిన పార్టీ వర్గాలు మాత్రం ఉబ్బితబ్బియ్యారు. ఇక సభలో కనపడిన విశేషాలు..

● వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రకృతి కూడా సహకరించిందని వేదికపై నుంచి పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

● అవసరమైన వారందరికీ అడుగడుగునా మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచారు.

● చంద్రబాబు షెడ్యూలు మేరకు సరిగ్గా 11.50 గంటలకు హెలికాప్టర్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 12.20కి వేదిక పైకి వచ్చారు. 12.44కు ఉపన్యాసం ప్రారంభించి దాదాపు గంటకు పైబడి మాట్లాడారు.

● సభ జరుగుతున్న మైదానం పైన ఐదారు డ్రోన్లు నిరవధికంగా సంచరిస్తూ కనిపించాయి. ఇందులో పోలీసులకు చెందిన డ్రోన్ కూడా ఉందని చెబుతున్నారు. అతి పెద్ద డ్రోన్ ఒకటి చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పైభాగంలో దానిని అనుసరిస్తూ వచ్చింది.

● సభా స్థలిలో జనాన్ని నియంత్రించకపోవడంతో బారికేడ్లు మొత్తం చెల్లాచెదురయ్యాయి. దీంతో జనం ఒక్కసారిగా వేదిక వద్దకు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో యువకులు టీడీపీ జెండాలు చేతబట్టి జై జై నినాదాలు కొనసాగించారు. దీంతో చంద్రబాబు తన ప్రసంగాన్ని చాలాసేపు ఆపేశారు.

● సభ జరుగుతున్న మైదానంపైన చంద్రబాబు, కిశోర్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో కూడి బెలూన్లు ఎగురవేశారు

● చంద్రబాబు ప్రసంగం సగం పూర్తయినా జాతీయ రహదారిపై నుంచి జనం సభా స్థలికి క్యూ కట్టి వస్తూనే కనిపించారు.

● సరిగ్గా 12.50 మైకులు పనిచేయక ఆగిపోయాయి. వేదిక వద్దకు జనాలు చేరడంతో మైకులకు అంతరాయం కలిగింది. పది నిమిషాల తరువాత పునరుద్ధరించారు.

● బారికేడ్లు ఛేధించుకుని జనం ఒక్క పెట్టున వేదిక ముందుకు రావడంతో జనంలో కసి బాగా కనిపిస్తోంది.

● పీలేరు గర్జిస్తోంది.. ఇక యుద్ధానికి సిద్ధం.. కురుక్షేత్ర సంగ్రామానికి సంసిద్ధం అంటూ పదే పదే చంద్రబాబు ఆవేశంగా ప్రసంగించారు.

## సార్...మీరు కాసింత లిబరల్‌గా ఉండాలి!

**● చంద్రబాబుకు నల్లారి అమరనాథరెడ్డి విజ్ఞప్తి**

'సార్, మీరు పరిపాలనలో స్ట్రిక్టుగా ఉండండి. కార్యకర్తల విషయంలో కాస్త లిబరల్‌గా ఉండాలి. గడిచిన ఐదేళ్లలో మన పార్టీ వాళ్లను వైసీపీ వారు అనేక ఇబ్బందులు పెట్టారు. మనం అధికారంలోకి వచ్చిన తరువాత వారి లెక్క తేల్చాలి. అక్రమంగా కేసులు పెట్టిన వారి భరతం పట్టాలి. ఆ సమయంలో మీరు మా మాట వినాలి. మీరు స్ట్రిక్టుగా ఉంటే కార్యకర్తలు నొచ్చుకుంటారు. వైసీపీకి చివరి రోజులు నడుస్తున్నాయని, త్వరలో జరిగే ఎన్నికల తరువాత అది శాశ్వతంగా మూతపడిపోతుందన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. స్వంత చెల్లెలుకు న్యాయం చేయలేని వాడు తమకు ఎటువంటి సాయం చేయలేడన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు వచ్చేశారన్నారు.





పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం మాటామంతి

వేదికపై టీడీపీ నాయకుడు గంటా నరహరి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి



వేదికపై టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు టీడీపీ నాయకులు జగన్‌మోహన్‌రాజు, చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



## దగ్గుబాటి కుమారుడి తొలి జీతం ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళం

కలికిరి, జనవరి 27: పీలేరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమారుడు దగ్గుబాటి పునీత్ తన తొలి వేతనాన్ని ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళంగా అందజేశారు. శనివారం పీలేరులో జరిగిన రా.. కదలి రా.. సభలో ఆయన నేరుగా ఇందుకు సంబంధించిన చెక్కును చంద్రబాబు నాయుడుకు అందజేశారు. 2022 జూలై 7న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజంపేట పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షా సమావేశాలను కలికిరిలో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముందు ఉదయం ఆయన నగరిపల్లెలోని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఇంటికి అల్పాహారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు తన కుమారుడు దగ్గుబాటి పునీత్‌ను చంద్రబాబుకు పరిచయం చేశారు. ఇంజినీరింగ్ చదువుతున్నానని, ఉద్యోగంలో చేరగానే తన మొదటి నెల జీతాన్ని ఎన్టీఆర్ ట్రస్టుకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు పునీత్ చెప్పారు. ఆ సందర్భంలో పునీత్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ చంద్రబాబు అభినందించారు. అనుకున్నట్టుగానే పునీత్ గత డిసెంబరు నెలలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరారు. జనవరిలో మొదటి జీతం తీసుకున్నారు. కాకతాళీయంగా శనివారం పీలేరు సభకు చంద్రబాబు రానుండటంతో గతంలో ఇచ్చిన హామీ మేరకు మొదటి నెల జీతం మొత్తానికి ఎన్టీఆర్ ట్రస్టు పేరు మీద రాసిన రూ.1,10,000ల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ యువనాయకుడు నల్లారి అమరనాథ రెడ్డి, తండ్రి వెంకటేశ్వర రావుల సమక్షంలో వేదికపైన చెక్కును అందుకున్న చంద్రబాబు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసి ఆ వెంటనే మాట నిలుపుకున్నందుకు అభినందించారు. ఉజ్వల భవిష్యత్తు లభించాలని ఆశీర్వదించారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దగ్గుబాటి పునీత్, వెంకటేశ్వరరావు

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు మృతి

వేముల, జనవరి 27: మండలంలోని వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు వెంకటరామిరెడ్డి (35) శుక్రవారం అర్ధరాత్రి వేంపల్లె మండలం నందిపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం రాత్రి వేంపల్లె నుంచి తన స్వగ్రామమైన వి.కొత్తపల్లెకు బైక్‌లో వస్తుండగా నందిపల్లె వద్ద బైక్‌లో నుంచి కిందపడగా ఇది గమనించిన వాహనదారులు హుటాహుటిన 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకై బెంగుళూరుకు తరలించారు. బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం 10 గంటలకు మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. వెంకటరామిరెడ్డికి ఈ మధ్యనే వివాహం కూడా ఖరారు కావడం వచ్చే నెలలో పెళ్లి కూడా చేయాలని వారి తల్లిదండ్రులు నిర్ణయించారు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, మండల టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు, జనవరి 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధి చౌడేశ్వరీ దేవాలయం ఎదురుగా రైల్వేస్టేషన్ వెళ్లే ఖాళీ వెంచర్లలో జంకానం మహబూబ్‌బాషా (45) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు జమ్మలమడుగు మండలం గూడెం చెరువు పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉన్నాడు. ఇతడి భార్య మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు మగపిల్లలున్నారు. ఒకరు ఇంటర్ చదువుతుండగా మరొకరు నాలుగు సంవత్సరాలు కలిగి ఉన్నాడని తెలిపారు. కాగా శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు గుర్తు తెలియని మృతదేహం కలిగి ఉందని సమాచారం వచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కడప నుంచి క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. మృతుడు బేల్దారి పనులు చేసుకుని జీవించేవాడు. ఇటీవల ఇంటిని దాదాపు రూ.8 లక్షలకు విక్రయించినట్లుగా మృతుడి బంధువులు తెలిపారు. ఇతడి గొంతుపై, తలకు, మర్మాంగాల వద్ద రక్తగాయాలయ్యాయి. జమ్మలమడుగు అర్బన్ పోలీసులు, అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రామాంజనేయులు (ఫైల్)

గాలివీడు, జనవరి27: పీలేరులో జరిగిన చంద్రబాబు బహిరంగ సభకు హాజరై తిరిగి వస్తుండగా మహల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. గాలివీడు మండలం గోరాన్‌చెరువు పంచాయతీ బీసీ కాలనీకి చెందిన రామాంజనేయులు (23), గణేశ్ శనివారం ఉదయం బైకుపై పీలేరులో రా.. కదలిరా.. సభకు వెళ్లారు. సభ పూర్తయిన తర్వాత తిరిగి వస్తుండగా మహల్ సమీపంలో కలకడ నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108 ద్వారా పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రామాంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో యువకుడికి రెండు కాళ్లు విరగడంతో తిరుపతికి తరలించినట్లు తెలిపారు. మృతుడు రామాంజులు తెలుగుదేశం పార్టీ అంటే అభిమానమని అతనికి తండ్రి కూడా లేడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

## ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 27 : పేద విద్యార్థులు చదువుతున్న బీబీఏ, బీసీఏ, జీఎంహెచ్ కోర్సులను ఏఐసీటీఈతో అనుసంధానం చేయడం వల్ల డిగ్రీకళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారి పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని వెంటనే ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీఎస్‌టియు రాష్ట కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఆ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన ఎన్ఈపీ వల్ల ప్రాథమిక విద్యవ్యవస్థ సర్వనాశనం అయిందన్నారు. నూతనవిద్యావిధానంలభాంగా ఏఐసీటీఈ పరిధిలోకి బీబీఏ, బీసీఏ, డీఎంహెచ్ కోర్సులను తేవడం వల్ల ఈ ప్రభావం డిగ్రీ విద్యపై పడుతుందని చెప్పారు. ఏఐసీటీఈ పరిధిలోని ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు డిగ్రీ వైపు వెళుతున్నారన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఇటువంటి కోర్సులు అందిస్తున్న డిగ్రీకళాశాలలపై ఎలాంటి భారం మోపడం సరైంది కాదన్నారు. డిగ్రీ విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసి నూతన జాతీయ విద్యావిదానంలో భాగమైన ఏఐసీఈటీపై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశ్, ఆనంద్, భాస్కర్ పాల్గొన్నారు.

## రాజంపేటలో నకిలీ పోలీసు అరెస్టు



నకిలీ పోలీసును చూపుతున్న సీఐ మద్దయ్య ఆచారి, నకిలీ పోలీసు వద్ద స్వాధీనం చేసుకున్న ఐడీ కార్డులు

రాజంపేట, జనవరి 27 : పోలీసునని చెప్పుకుంటూ రాజంపేట ప్రాంతంలోని విద్యానగర్ చుట్టుపక్కల అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బద్వేలు పట్టణానికి చెందిన శివయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాజంపేట పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. శనివారం రాజంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పోలీసు యూనిఫాం పోలిన దుస్తులు వేసుకొని విద్యా నగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేసి, డబ్బులు వసూలు చేస్తున్నాడన్న సమాచారంతో అతన్ని పట్టుకున్నామన్నారు. ఐ

అతనికి పోలీసు డిపార్ట్‌మెంటుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. మూడు నకిలీ ఐడీ కార్డులు, వాకీటాకీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌గౌడ్, ఏఎస్ఐ ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెడ్మాస్టర్

చాపాడు, జనవరి 27: మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కమీరున్, గోవర్ధన్ అనే విద్యార్థులు రోప్‌స్కిప్పింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ రమణ తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జ్‌క్లబ్‌లో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ ఆటలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలు అండర్-14 విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో అయ్యవారిపల్లె విద్యార్థులను అధికారులు ఎంపిక చేశారు. ఈనెల 28న ఆదివారం తూర్పుగోదావరి జిల్లాలోని భీమవరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా కమీరున్ 7వ తరగతి, గోవర్ధన్ 8వ తరగతి చదువుతున్నాడు. పీఈటీ టీచర్ శివారెడ్డి, ఇతర ఉపాధ్యాయులు వారిని అభినందించి హర్షం వెలిబుచ్చారు.



రాజంపేట: వాహన శ్రేణితో పీలేరుకు బయలుదేరిన రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి



రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట వద్ద పీలేరు సభకు జెండా ఊపుతున్న కస్తూరి



రామాపురం: జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి



పీలేరులో రా.. కదలిరా సభలో వీరబల్లి టీడీపీ శ్రేణులతో చమర్తి

# రా.. కదలిరా.. సభకు వాహనాల బారులు

రాజంపేట, జనవరి 27: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పీలేరులో నిర్వహించినన రా.. కదలిరా.. సభకు రాజంపేట నుంచి వందలాది వాహనాల్లో టీడీపీ నేతలు బయలుదేరారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు, నేతలు గంటా నరహరి, మేడా విజయశేఖర్‌రెడ్డి, పోలి సుబ్బారెడ్డి, జనసేన పార్టీ నాయకులు శ్రీనివాసరాజు తదితరులు ఎవరికి వారుగా తమ అనుచరులతో కలిసి వందలాది వాహనాల్లో బయలుదేరారు. శనివారం తెల్లవారుజామునే నాయకులు పోటాపోటీగా ప్రత్యేక వాహనాల్లో బయలుదేరడంతో రాజంపేట పట్టణంలో ఆరు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల వాహనాలు నిలిచిపోవడంపై నిరసన వ్యక్తం కావడంతో పోలీసులు జోక్యం చేసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రాజంపేట నుంచి రాయచోటి రోడ్డు పూర్తిగా తెలుగుదేశం పార్టీ నాయకుల వాహనాలతో నిండిపోయింది.

**రైల్వేకోడూరు:** రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు, టీడీపీ నేత ముక్కా రూపానందరెడ్డి వేర్వేరుగా భారీగా తమ వాహనాల్లో తరలి వెళ్లారు. రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె, పెనగలూరు మండలాల నుంచి సర్పంచ్‌లు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. సభ లో చంద్రబాబు కు ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చారు. టీడీపీ నేత ముక్కా రూపానందరెడ్డి , కస్తూరి విశ్వనాథనాయుడు చంద్రబాబును కలుసుకున్నారు. రాష్ట్ర బీసీ నాయకులు నాయుడోరి రమణ, కమతం నాగరాజుయాదవ్, క్షత్రియ నాయకులు జి. వెంకటేశ్వరరాజు, పరిశీలకులు హేమాంబధరరావు, మండల పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

**గాలివీడు:** మండలంలోని 17 పంచాయతీల నుంచి భారీ ఎత్తున తరలివెళ్లారు. మహిళలు కూడా తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

**రామాపురం:** మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, రాయ చోటి టీడీపీ సీనియర్ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

**సంబేపల్లె:** టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంబేపలెలోని కార్యకర్తలకు, నాయకులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం రాముడు ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్‌తో తరలి వెళ్లారు. టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు రమేశ్‌కుమార్‌రెడ్డి గుట్టపల్లి సమీపంలోని గంగా హోటల్ వద్ద అల్పాహారం ఏర్పాటు చేశారు. తిరుగు ప్రయాణంలో శతమానం భవతి కల్యాణ మండపంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

**లక్కిరెడ్డిపల్లె:** నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆర్ రమేష్‌కుమార్‌రెడి ఆధ్వర్యంలో 75 సుమోలు బయలు దేరాయి. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, సర్పంచులు కేశవులు, చంద్రాయుడు, లక్ష్మినారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, ఆర్‌ఆర్ అభిమానులు తరలివెళ్లారు.

**సిద్దవటం:** రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో 50 కార్లు, 25 బస్సుల్లో తరలి వెళ్లారు. మండల యువ నాయకుడు రాజేష్ నాయుడు, అయ్యప్పనాయుడు, చెంచయ్య నాయుడు, రాజశేఖర్ యాదవ్, చలమయ్య యాదవ్, కాటే శ్రీని వాసులు నాయుడు, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ నాయుడు సార.థ్యంలో కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండలంలోని కమ్మపాలెం నుంచి యువ నాయకుడు రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో దాదాపు 40 కార్లు, రెండు బస్సుల్లో నాగభూషణం, జ్యోతిరామిరెడ్డి తదితరులు, భాకరాపేట నుంచి మండల నాయకుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథరామ నాయుడు ఆధ్వర్యంలో పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, మండల మాజీ ప్రెసిడెంటు సామ శ్రీనివాసులు, సీనియర్ నేతలు కాడే శ్రీనివాసులునాయుడు, అసెంబ్లీ కార్యదర్శి రామ్మోహన్ నాయుడు తదితరులు తరలివెళ్లారు.

**చిట్వేలి:** యువ నాయకుడు కాకర్ల నాగార్జున, టీడీపీ నేతలు మూల రోడ్డు వద్ద పూజల అనంతరం భారీ వాహనాలతో తరలివెళ్లారు.

**ఓబులవారిపల్లె :** ప్రముఖ పారిశ్రామిక వేత్త ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో రైల్వేకోడూరు నియోజకవర్గంనుంచి సుమారు 500కు పైగా వాహనాలలో కార్యకర్తలను తరలించారు.



రాజంపేట మార్గంలో బారులు తీరిన వాహనాలు

**ఒంటిమిట్ట:** టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 100 కార్లు 10 బస్సుల్లో , గంటా నరహరి ఆధ్వర్యంలో 100 వాహనాలు, మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద వాహనాలు, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, కాంట్రాక్టర్ ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో సుమారు 50వాహనాల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, నామాల వెంకటయ్య, బొబ్బిలి రాయుడు, ఆంజనేయరెడ్డి, శివారెడ్డి, ఓబినేని సుబ్బమ్మ, హరినాధరెడ్డి, డాక్టర్ శివ, మోదుగుల నరసింహులు, షేక్ షఫీ, పత్తి సుబ్బరాయుడు, డాక్టర్ జిలాన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**సుండుపల్లె:** మండలంలోని 14 గ్రామ పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, ప్రజలను బస్సులు, జీపులు, కార్లలో తరలించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. . సభకు వెళ్లిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లను పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఏర్పాటు చేశారు.

**వీరబల్లి:** పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభి మానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షులు భానుగోపాల్ రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పెనగలూరు:** రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అనుచర వర్గం దాదాపు 60 వాహనాలను స్వచ్ఛందంగా సమకూర్చుకుని మండలంలోని అన్ని గ్రామాల నుంచి తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి రూపానందరెడ్డి వర్గంలో చేరిపోయిన నారాయణరెడ్డి కూడా తన అనుచరులతో వెళ్లారు.

## చంద్రబాబుకు గంటా నరహరి సత్కారం



చంద్రబాబునాయుడును సన్మానిస్తున్న గంటా నరహరి

రాజంపేట, జనవరి 27 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి పీలేరు సభ వద్ద కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## మంచి సమాజం కోసమే 'మానవత'

చిట్వేలి, జనవరి 27 : మంచి సమాజ నిర్మాణం కోసమే మానవత సంస్థను స్థాపించారని ఆ సంస్థ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో నిరుపేద అనాధ విద్యార్థి అనారోగ్యంతో పోరాటం చేస్తూ చదువుకుంటున్న సాదిక్‌కు ప్రోత్సాహంగా 5000రూపాయల చెక్కును చిట్వేలి శాఖ సభ్యులుతో కలిసి అందించారు. ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాజంపేట అధ్యక్షుడు అబ్దుల్లాను చిట్వేలి శాఖ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, సభ్యులు విశ్వనాథం, రంగారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఏబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై ఉక్కుపాదం

చిట్వేలి, జనవరి 27 : అసాంఘిక కార్యకలాపాలు, బెల్టుషాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు సీఐ మధుసూధన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన చిట్వేలి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. . అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు, అనవసర నేరాలకు పాల్పడేవారిపై ఉపేక్ష చూపమన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టించేవారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్ఐని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, హెచ్‌సీ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్కౌట్ విద్యార్థులకు ప్రశంసా పత్రం

సంబేపల్లె, జనవరి27: గణతంత్ర దినోత్సవ కవాతులో సంబేపల్లె హైస్కూల్ స్కౌట్ విద్యార్థులు శ్రీనివాసులు, అజయ్ ప్రతిభ చూపడంతో జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాడి నరసింహారెడ్డి, సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

# సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటిటౌన్, జనవరి 27: వివిధ సమస్యలపై సచివాలయానికి అందే అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. శనివారం ఆయన గొర్లముదివేడు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని, అప్పుడే ప్రజలకు మన పై నమ్మకం కలుగుతుందన్నారు. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనతను దూరం చేయడానికి పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ స్కూల్‌ల్లో చదివే చిన్నారులకు స క్రమంగా పౌష్టికాహారం అందజేయాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, వైఎస్ ఆర్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, రైతు భరోసా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితా, ప్రజాసమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగరవనంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

**నగరవనం అభివృద్ధికి సహకరించాలి**

ఎగువ అబ్బవరం సమీపంలో నిర్మించిన నగరవనంలో మాండవ్య ఎకో పార్కును ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో నగరవనం త్వరితగతిన అభివృద్ధి జరగడలో గర్వించదగ్గ విషయమన్నారు. రాబోయే రోజుల్లో నగరవనం రూపురేఖలు మార్చేందుకు ప్రజలు, దాతలు ప్రతి ఒక్కరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఏపీఎఫ్డీసీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ఫయాజ్‌బాషా, అడిషినల్ పీసీసీఎఫ్ డీకేసింగ్,సీపీఎఫ్ నాగేశ్వరరావు, ఐసీఐసీఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ అనూష, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగమునీశ్వరి, ఫారెస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**● విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**

**వీరబల్లి:** విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. వీరబల్లి మండలం ఉప్పరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన లైబ్రరీని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని తమ పిల్లలు బాగా చదవాలని పాఠశాలలకు పంపుతుం టారని విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. వంగిమళ్ల గ్రామంలో ని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆమూరివాండ్ల కిరణ్ సహకారంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో నిర్మించిన లైబ్రరీని సద్వినియోగం చేసు కోవాలన్నారు. జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి భారీగా నిధులు ఖర్చు చేస్తుందన్నారు. విద్యార్థి బాగా చదివి ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయికి ఎదగాలన్నారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఉప్పరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆమూరివాండ్ల కిరణ్ సహకారంతో లైబ్రరీ ఏర్పాటు చేసుకోవడం ఎంతో శుభ పరిణామమని విద్యార్థులందరూ ఈ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప్పరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రహరీగోడ, వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సర్పంచ్ సరస్వతమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి కోర్టుల తరలింపు

రాయచోటిటౌన్, జనవరి27: నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించడం కోసం రాయచోటి కోర్టు సముదాయాన్ని శనివారం ఒక అద్దె భవనం లోనికి మార్చారు. రాయచోటిలో ప్రస్తుతం ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్, ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులు పని చేస్తున్నాయి. అయితే అడిషనల్ ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు 2026లో నిర్మించిన నూతన భవనాల్లో కొనసాగుతోంది. మిగి లిన కోర్టులన్నీ కూడా 1984లో నిర్మించిన పాత భవనాల్లో నడుస్తున్నాయి. ఈ భవనాలకు 15 సంవత్సరాల క్రితం మరమ్మతులు కూడా చేశా రు. అయితే గత రెండు, మూడు సంవత్సరా లుగా భవనాల మోల్డింగ్ పెచ్చులు ఊడి కింద పడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నా యి. దీంతో పాత కోర్టు భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలన్నరోడ్లు భవనాలు శాఖ వారి సూచనలను రాయచోటి ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాత కోర్టు భవనాల్లో నిర్వ హిస్తున్న రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులను ప్రైవేట్ భవనాల్లోనికి మార్చాలని హైకోర్టు నుండి ఇటీవలనే ఆదేశాలు రావడంతో రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డు మార్గంలోని లక్ష్మీపురంలో ఖాళీగా ఉన్న ఒక ప్రై వేటు పాఠశాల భవనాలను అద్దెకు తీసుకుని శనివారం పాత భవనంలో ఉన్న మూడు కోర్టు లను అద్దె భవనాల్లోకి తరలించారు. శనివారం నాడు లోక్‌అదాలత్ కూడా నిర్వహించారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో మూడు కోర్టులు కూడా అక్కడే పనిచేస్తాయని రాయ చోటి ఐదవ జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి న్యాయవాదు లకు తెలియజేశారు. ఈ విషయాన్ని కక్షిదారుల కు అందరికీ కూడా తెలియజేయాలని ఆయన కోరారు.




లక్ష్మీపురంలోని ఒక ప్రైవేటు పాఠశాల భవనాల్లో ఏర్పాటైన కోర్టు సముదాయం

**నూతన భవనాల నిర్మాణానికి కృషి చేద్దాం:**

రాయచోటి పాత కోర్టు భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని రాయచోటి ఐదవ అదన పు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. లక్ష్మీపురంలోని అద్దె భవనాల్లో శనివారం ఉదయం మొదటిసారిగా జరిగిన లోక్‌అదాలత్ కేసుల పరిష్కా రాల సందర్భంగా ఆయన న్యాయవాదులతో మాట్లాడారు. త్వరలోనే రాయచోటి పాత కోర్టు వనాలను తొలగించడానికి హైకోర్టు నుంచి ఆదేశాలు వస్తాయని, వాటి స్థానంలో నూతన భవనాలను ఆధునికంగా నిర్మించడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన అన్నారు.



## కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. కనికరించండి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్నముంపు వాసులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 27: రెండేళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాం. కనికరించండయ్యా.. అని రాజంపేట మండలం ఆపురాజుపేట పంచాయతీ లోని వినాయకనగర్‌కు చెందిన 50 మంది ఎస్సీలు శనివారం కలెక్టర్ కార్యా లయం ముందు ఆందోళన చేశారు. నందలూరు మండలం తిమ్మరాజుపల్లె అరుంధతివాడ 2007లో సోమశిల బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురి కాగా, ప్రభుత్వం ఇళ్లు, ఒక్కో కుటుంబానికి 40 సెంట్ల పొలం ఇచ్చిందన్నారు. అయితే, ఆ భూమిని ఇప్పటి వరకు చూపించడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదన్నారు. తమ నివా సాల పక్కనే సర్వే నెంబర్ 831లో దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఎంతో కాలంగా ఆ భూమిని చూసుకుని తాము బతుకుతుండగా, ఇప్పుడు ఒక బడా నాయకుడు ఆ భూమిని కాజేయాలని చూస్తున్నాడని తెలిసిందన్నారు. ఆ పొలానికి సంబంధించిన రికార్డులు సబ్ డివిజన్ కోసం ఆర్డీవో కార్యాలయానికి పంపించారు. అయితే, ఏం జరిగిందో ఏమో కానీ తమకు పట్టాలు ఇవ్వకుండా పెండింగ్ పెట్టేశారని ఆరోపించారు. దీనిపై న్యాయం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌కు కోరుతున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

## బకాయిలు చెల్లించాలి : ఆపస్




మాట్లాడుతున్న అపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్

రాయచోటి టౌన్, జనవరి 27: బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం అపస్ కార్యాలయంలో నిర్వహించిన అన్నమయ్య జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ఉన్న డీఏ, సీపీఎస్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పరశురాం, ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల కేంద్రం ఉన్న పాఠశాలల్లో నాడు- నేడు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులు ఉపాధ్యాయులపైన ఒత్తిడి చేస్తున్నారన్నారు. కానీ, నిధులు లేకుండా పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప ఏ పెన్షన్ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అంగీకరించదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీ. నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మధుమతి మాట్లాడుతూ ముఖ ఆధారిత అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర, జిల్లా కార్యదర్శులు బాలాజీ, శ్రీనివాసులు, జిల్లా మహిళా కోకన్వీనర్ శైలజ, ఆపస్ నాయకులు రెడ్డెయ్యరాజు, మధుసూదన్‌రావు, రాంప్రసాద్, మనోశర్, చెన్నకృష్ణయ్య తదితర ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోష్ యాక్ట్‌పై అవగాహన

సిద్దవటం, జనవరి27 : సిద్దవటం మండలంలోని సిద్దవటం జూని యర్ సివిల్ జడ్జి కోర్టు ఆవర ణంలో శనివారం జూనియర్ సివి ల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ అధ్యక్షత న పోష్ యాక్ట్‌పై మండలంలోని అన్ని శాఖల అధికారులకు అవగా హన కల్పించినట్లు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ తెలి పారు. మహిళలకు వారు పనిచేసే ప్రదేశాల్లో పురుషుల నుంచి, పురుష ఉన్నతా ధికారుల నుంచి వేధింపులకు గురి కాకుండా ప్రభుత్వం ఈ చట్టం ప్రవేశ పెట్టిం దన్నారు. ఈ యాక్ట్‌పై మహిళలు, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించడంతో పాటు, మహిళలపై వేధింపులు అరికట్టాలని మహిళలను గౌరవించాలని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళ ఉద్యోగులకు లీగల్ సర్వీస్ చట్టాల గురించి అవగాహన కల్పించారు.

## విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

నందలూరు, జనవరి 27 : విద్యా ర్థులలో నిద్రావణమైన సృజనాత్మక శక్తిని వెలికి తీసిన నాడు భారత జాతి మరింత ప్రతిభావంతమవ ుతుందని రాజంపేట స్పెషల్ జుడిషి యల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అన్నారు. మండలంలోని ఆడపూరు అంబేడ్కర్ గురుకుల బాలికల కళా శాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి దండ్రులు, గురువులు పెద్దల పట్ల గౌరవం కలిగి దేశభక్తిని పెంపొందించు కోవాలన్నారు. 10వ తరగతి ఇంటర్మీడియట్ తరువాత కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆయనను సత్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు హేమ, సునీత, అనిత, సలోని, ప్రతిభ, భారతి, వాణి, మహేశ్వరి, శివపార్వతి, విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

రైల్వేకోడూరు, జనవరి 27: చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రైల్వే కోడూరు న్యాయస్థానం జడ్జి అంజనీప్రియదర్శిని తెలిపారు. శని వారం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ విద్యార్థి దశలోనే చట్టాల గురిం చి తెలుసుకుంటే నేరాలకు పాల్పడకుండా ఉంటారన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రాగింగ్ నేరమని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలన్నారు. ఈ కార్యక్రమం లో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉపాధి, ఉద్యోగ వివరాల సేకరణ

నందలూరు, జనవరి27 : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు 15 నుంచి 29 ఏళ్ల యువత ఉపాధి, ఉద్యోగ వివరాలు సేకరించినట్లు పీవో డాక్టర్ పి.నీలవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం ఇంటింటి యూత్ సర్వే నిర్వహించామన్నారు. యువత జీవన విధానాన్ని, పొదుపు అంశాలను సేకరించామన్నారు. అనంతరం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, రమేష్, కృష్ణుడు, సీనియర్ క్రీడాకారులు, గ్రీష్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## రూ.3.75 కోట్లు ఆసరా నిధుల పంపిణీ

పెనగలూరు, జనవరి27 : మండలంలోని 575 స్వయం సహాయక సంఘాలలోని 650 మంది మహిళలకు శనివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు ఆసరా నిధులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్‌కుమార్, ఎంపీపీ కొండూరు సౌందర్య, వైస్ ఎంపీపీలు కొండూరు విజయ్‌రెడ్డి, బి.రోశయ్య, జెడ్పీటీసీ సభ్యుడు యు.పి.సుబ్బరాయుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి బి.ఎల్.నరసింహారెడ్డి, తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో వరప్రసాద్, ఏవో పద్మభూషణ్‌రెడ్డి, ఈవోఆర్‌డీ బాలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 67వ జాతీయ అండర్-14 కబడ్డీ పోటీల ర్యాలీ

రాజంపేట టౌన్, జనవరి27 : నేటి నుంచి 67వ జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులతో కలిసి సాయంత్రం జాతీయ అండర్-14 కబడ్డీ పోటీల ర్యాలీని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ప్రారంభించారు. రాజంపేట పట్టణ ప్రధాన రహదారుల మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ఆర్ఐపీఈ భానుమూర్తిరాజు, డిప్యూటీ డీఈవో వరలక్ష్మీ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంతలు పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారిణులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఐసీలో నందలూరు విద్యార్థులకు గోల్డ్ మెడల్

నందలూరు, నవంబరు 27 : ఎన్ఎస్ఐసీ (నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ చాలెంజ్) ఇండియా కాంపిటీషన్‌లో నందలూరు గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు ఆఫ్రీన్, ఆర్షియా తస్లీమ్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ కరస్పాండెంట్లు గొబ్బిళ్ల త్రినాథ్, శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ నెల ఈ నెల 23, 24వ తేదీలలో బెంగుళూరులో జరిగిన ఫైనల్స్‌లో వివిధ రాష్ట్రాల నుంచి 40 టీమ్స్ పాల్గొనగా జ్యూరీ మెంబర్స్ తమ విద్యార్థులు తయారు చేసిన అస్త్ర, కవచ పరికరాలు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాయన్నారు. దీంతో గోల్డ్ మెడల్, క్యాష్ రివార్డ్ రూ. 50 వేలు అందజేశారన్నారు.

## నిరుపేద మహిళకు ఉపాధి కల్పన

సిద్దవటం, జనవరి 27 : భర్త చనిపోవడంతో నలుగురు పిల్లలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్న మహబూబ్ నగర్ గ్రామానికి చెందిన బీబీ అనే మహిళకు కడపకు చెందిన తేజస్విని చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు నీలం సోమశేఖర్‌రెడ్డి దాదాపు 20వేల రూపాయల విలువ చేసే కుట్టు మిషన్‌ను, జిగ్‌జాగ్ మిషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరాపురం ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడు సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు రామ కేశవ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు చంద్ర, అవ్వారు రవిశంకర్, జానపాటి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై వాకథాన్

రాయచోటిటౌన్, జనవరి 27: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా రవాణా అధికారి దినేశ్ చంద్ర ఆధ్వర్యంలో వాక్‌థాన్ ని ర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని శివా లయం జంక్షన్ (చెక్‌పోస్టు) నుంచి బంగ్లా జంక్షన్ వరకు వాకథాన్ నిర్వహించారు. రాయ చోటి పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. రాయచోటి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, డ్రైవింగ్ స్కూల్ యజమానులు, విద్యార్థులు ప్లకార్డులు, రోడ్ సేఫ్టీ బ్యానర్‌లు పట్టుకొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎంవీఐ సుబ్బరాయుడు, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ రాజారెడ్డి, హోంగార్డు రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ

రైల్వేకోడూరు, జనవరి 27: ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధిం చిన విద్యార్థులకు తన తల్లిదండ్రులు, సోదరుడు పాములపాటి వెంకట సుబ్బానాయుడు జ్ఞాపకార్థం పాములపాటి సుబ్బరాయుడునాయుడు శనివారం నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పూజకు రూ. 15,000, సుబ్బనరసమ్మకు రూ. 10,000, కార్తీక్‌రెడ్డికి రూ. 5,000, క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థి అపర్ణకు రూ. 5,000లు నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

నందలూరు, జనవరి 27 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అహమ్మద్ జహీర్ తెలిపారు. దిగువపల్లికి చెందిన కొండూరు సుబ్బరాజు శనివారం చెయ్యేరు వద్ద మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# జన.. ప్రభంజనం...

## పీలేరు సభకు పోటెత్తిన ప్రజలు

పీలేరు, జనవరి 27 : పీలేరులో శనివారం జరిగిన రా.. కదలిరా సభకు లక్షకు పైగా జనం రావడంతో జన.. ప్రభంజనంలా మారింది. జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో అంతకుమించి జనం సమీపంలోని జాతీయ రహదారిపై ఆగిపోవలసి వచ్చింది. పీలేరు నుంచి మదనపల్లెకు వెళ్లే జాతీయ రహదారి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా వాహనాలు, అందులో వచ్చిన జనంతో రవాణా దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.



## ల్యాండ్, శ్యాండ్, మైన్‌తో వైసీపీ దోపిడీ

**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్**



వైసీపీ వారు ల్యాండ్, శ్యాండ్, మైన్-వైన్‌లతో రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పీలేరు సభలో ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప వైసీపీ పాలనలో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టలేరన్నారు. పీలేరు నియోజకవర్గంలోని యువత కోసం తాము ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సుమారు 2 వేల ఎకరాలు సేకరిస్తే వాటిలో పరిశ్రమలు స్థాపించకుండా ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పెద్దిరెడ్డి అన్యాయం చేశారన్నారు. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరిచ్చే ఝరికోన ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదన్నారు. రాజంపేట ఎంపీ స్థానంతో పాటు దాని పరిధిలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలను టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. తమ కుటుంబంపై ఎనలేని ప్రేమ, అభిమానం చూపిస్తున్న పీలేరు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగానికి లోనయ్యారు. పీలేరు సభను విజయవంతం చేసిన రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల టీడీపీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీ అరాచక పాలన అంతమే ధ్యేయం

**రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు**



రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక, విధ్వంస పాలన అంతమే తమ ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. పీలేరులో జరిగిన 'రా...కదలిరా' సభలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా వైసీపీ నాయకుడు పెడుతున్న అనేక అక్రమ కేసులు ఎదుర్కొంటూ కూడా పార్టీ పట్ల నమ్మకం కలిగి ఉన్న కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలన కారణంగా అభివృద్ధిలో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పీలేరు సభకు హాజరైన జనసమూహాన్ని చూసి తాడేపల్లె ప్యాలెస్‌లోని జగన్, పుంగనూరు పుడంగి పెద్దిరెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయన్నారు. అధికారంతో గత నాలుగేళ్లుగా మద్యం, ఇసుక అక్రమ వ్యాపారాల్లో సంపాదించిన డబ్బు సంచులతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ నాయకులు వస్తారని వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు సీటుతో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## ప్రజలే జగన్‌ను ట్రాన్స్‌ఫర్ చేస్తారు

**● కంచెర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ**



ఎమ్మెల్యేలు, ఎంపీలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు త్వరలో రాష్ట్రం నుంచి ట్రాన్స్‌ఫర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. నా వెంట్రుక కూడా పీకలేరని డాంబికాలు పలికిన జగన్, ప్రస్తుతం జనాగ్రహాన్ని గ్రహించి సంతోషంగా దిగిపోతానని ఓటమిని అంగీకరిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

**పసుపులేటి హరిప్రసాద్, జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు**



దేశానికే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్ గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చివేశారు. దేశంలో ఎక్కడ గంజాయి కేసులు బయటపడినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో తేలుతున్నాయన్నారు. ఆయన నేతృత్వంలోని వైసీపీ గంజాయి, ఎర్రచందనం, లిక్కర్, ఇసుక మాఫియాగా మారిపోయిందని, ముఖ్యమంత్రి జగన్ మాఫియా డాన్‌గా మారిపోయారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేస్తారని అన్నారు.

## నాతోనే అంతమవుతావ్

**చల్లా రామచంద్రారెడ్డి, పుంగనూరు**



'1989లో నాపై గెలిచి రాజకీయ జీవితం ప్రారంభించావ్, ఈ ఎన్నికల్లో నా చేతుల్లో ఓడిపోయి రాజకీయంగా అంతమైపోతావ్' అంటూ మంత్రి పెద్దిరెడ్డిపై పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) పీలేరు సభలో ఫైర్ అయ్యారు. పీలేరు సభను చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నులో వణుకు పుట్టిస్తోందన్నారు. పీఎల్ఆర్ సంస్థ పేరుతో రైతులకు ఒక్కరూపాయి నష్టపరిహారం చెల్లించకుండా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వారిద్దరి అధికారం అంతం అయ్యే సమయం ఆసన్నమైందన్నారు.

## చంద్రబాబు సభలో హైలైట్స్

కలికిరి/కలకడ, జనవరి 27: శనివారం పీలేరులో జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భారీ బహిరంగ సభ అనుకున్నదానికి మించి విజయవంతమైంది. రాజంపేట పార్లమెంటు పరిధిలో జరిగిన ఈ సభకు రాజంపేట, కోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నుంచి జనాలు హాజరయ్యారు. లక్షకు పైబడి జనం హాజరయ్యారని చెబుతుండగా అందులో సగం మంది జాతీయ రహదారిపై ఏడెనిమిది కిలోమీటర్ల మేర ఇరుక్కుపోయారు. మొత్తానికి జనసందోహాన్ని చూసిన పార్టీ వర్గాలు మాత్రం ఉబ్బితబ్బియ్యారు. ఇక సభలో కనపడిన విశేషాలు..

- వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రకృతి కూడా సహకరించిందని వేదికపై నుంచి పలువురు సంతోషం వ్యక్తం చేశారు.
- అవసరమైన వారందరికీ అడుగడుగునా మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచారు.
- చంద్రబాబు షెడ్యూలు మేరకు సరిగ్గా 11.50 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 12.20కి వేదిక పైకి వచ్చారు. 12.44కు ఉపన్యాసం ప్రారంభించి దాదాపు గంటకు పైబడి మాట్లాడారు.
- సభ జరుగుతున్న మైదానం పైన ఐదారు డ్రోన్లు నిరవధికంగా సంచరిస్తూ కనిపించాయి. ఇందులో పోలీసులకు చెందిన డ్రోన్ కూడా ఉందని చెబుతున్నారు. అతి పెద్ద డ్రోన్ ఒకటి చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్ పైభాగంలో దానిని అనుసరిస్తూ వచ్చింది.
- సభా స్థలిలో జనాన్ని నియంత్రించకపోవడంతో బారికేడ్లు మొత్తం చెల్లాచెదురయ్యాయి. దీంతో జనం ఒక్కసారిగా వేదిక వద్దకు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో యువకులు టీడీపీ జెండాలు చేతబట్టి జై జై నినాదాలు కొనసాగించారు. దీంతో చంద్రబాబు తన ప్రసంగాన్ని చాలాసేపు ఆపేశారు.
- సభ జరుగుతున్న మైదానంపైన చంద్రబాబు, కిశోర్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో కూడి బెలూన్లు ఎగురవేశారు
- చంద్రబాబు ప్రసంగం సగం పూర్తయినా జాతీయ రహదారిపై నుంచి జనం సభా స్థలికి క్యూ కట్టి వస్తూనే కనిపించారు.
- సరిగ్గా 12.50 మైకులు పనిచేయక ఆగిపోయాయి. వేదిక వద్దకు జనాలు చేరడంతో మైకులకు అంతరాయం కలిగింది. పది నిమిషాల తరువాత పునరుద్ధరించారు.
- బారికేడ్లు ఛేదించుకుని జనం ఒక్క పెట్టున వేదిక ముందుకు రావడంతో జనంలో కసి బాగా కనిపిస్తోంది.
- పీలేరు గర్జిస్తోంది.. ఇక యుద్ధానికి సిద్ధం.. కురుక్షేత్ర సంగ్రామానికి సంసిద్ధం అంటూ పదే పదే చంద్రబాబు ఆవేశంగా ప్రసంగించారు.

## సార్...మీరు కాసింత లిబరల్‌గా ఉండాలి!

**● చంద్రబాబుకు నల్లారి అమరనాథరెడ్డి విజ్ఞప్తి**

'సార్, మీరు పరిపాలనలో స్ట్రిక్టుగా ఉండండి. కార్యకర్తల విషయంలో కాస్త లిబరల్‌గా ఉండాలి. గడిచిన ఐదేళ్లలో మన పార్టీ వాళ్లను వైసీపీ వారు అనేక ఇబ్బందులు పెట్టారు. మనం అధికారంలోకి వచ్చిన తరువాత వారి లెక్క తేల్చాలి. అక్రమంగా కేసులు పెట్టిన వారి భరతం పట్టాలి. ఆ సమయంలో మీరు మా మాట వినాలి. మీరు స్ట్రిక్టుగా ఉంటే కార్యకర్తలు నొచ్చుకుంటారు. వైసీపీకి చివరి రోజులు నడుస్తున్నాయని, త్వరలో జరిగే ఎన్నికల తరువాత అది శాశ్వతంగా మూతపడిపోతుందన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. స్వంత చెల్లెలికి న్యాయం చేయలేని వాడు తమకు ఎటువంటి సాయం చేయలేడన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు వచ్చేశారన్నారు.



## ఉమ్మడి కడపనుంచి జిల్లాకు 15మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 27: ఉమ్మడి కడప జిల్లాలో ఎంపీడీవోలుగా పనిచేస్తున్న వారిలో నుంచి 15 మందిని మన జిల్లాకు బదిలీచేస్తూ శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఎ.జగదీశ్వర్‌రెడ్డి, జి.కృష్ణమూర్తి, ఎస్.నూర్జహాన్, పి.వీరప్రసాద్, సి.వెంకటేశు, బి.మైథిలి, కె.కుళ్ళాయమ్మ, టి.వెంగముని రెడ్డి, సి.రామకృష్ణయ్య, పి.మహబూబ్ బీ, జి.రవికుమార్ రెడ్డి, సి.వెంకటరమణయ్య, జె.సుజాతమ్మ, జి.రెడ్డయ్య, కె.వి.శ్రీధర్ నాయుడు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరు 2024 జనవరి 30వ తేదీనాటికి ఉన్న స్థానాలనుంచి రిలీవ్ అయి పోస్టింగ్స్ ఇచ్చిన చోట బాధ్యతలు చేపట్టనున్నారు.

## ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు



విద్యార్థుల అడ్మిట్ కార్డును పరిశీలిస్తున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), జనవరి 27: చిత్తూరులోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీటమ్స్)లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 128 మంది విద్యార్థులకుగాను 124మంది హాజరవగా, నలుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 128 మందికిగాను 122 మంది హాజరవగా, ఆరుగురు గైర్హాజరైనట్లు జేఈఈ మెయిన్స్ సిటీ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

## ఆపదలో కోడికత్తి శీను ప్రాణాలు

**కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్**

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: 'కోడికత్తి శీను ప్రాణాలు ఆపదలో ఉన్నాయి. జైల్లోనే చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఒకప్పటి కోడికత్తి ఘటనపై విశాఖపట్టణం విమానాశ్రయం అధికారులతో తాను మాట్లాడానంటూ, ఎన్నికలకు ముందు ప్రచారం కోసం ఒక మాజీ మంత్రి ఇచ్చిన సలహాతో కోడికత్తి రక్తపు డ్రామా ఆడారని అన్నారు. అసలు జగన్ చొక్కాకు అంటుకున్న రక్తం ఎవరిదో ఫోరెన్సిక్ పరీక్షలు చేస్తే అసలు గుట్టు బయటపడుతుందని అన్నారు. ఐదేళ్లుగా ఓ దళితుడిని జైల్లో నిర్బంధించి బెయిల్ కూడా రాకుండా చేస్తున్నారని, అసలు జగన్ ఎందుకు కోర్టు ముందుకు రావడంలేదు? ఇందువల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో వైరుదొంగ మృతి



మృతి చెందిన రమేష్

దొరవారిసత్రం, జనవరి 27: ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరును అపహరించే ప్రయత్నంలో విద్యుత్ ప్రమాదానికి గురై ఓ దొంగ మృతి చెందాడు.పోలీసుల కథనం మేరకు ... తిరుపతి జిల్లా డక్కిలి మండలం మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన రమేష్(31)తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైరు అపహరిస్తుంటాడు. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి.దొరవారిసత్రం మండలంలోని నెలబల్లివాసమ్మ గుడి ఎదురుగా జాతీయ రహదారి పక్కన గల అడవిలో వున్న ట్రాన్స్‌ఫార్మర్ కొంతకాలం క్రితం పాడైంది.దీన్ని గమనించిన రమేష్ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరును అపహరించేందుకు శుక్రవారం రాత్రి ప్రయత్నం చేశాడు.అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.శనివారం సాయంత్రం స్థానికులు రమేష్ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

## మా డబ్బులిప్పించండి

**పోలీసుల చుట్టూ తిరుగుతున్న 'లిల్లీ' యాప్ బాధితులు**

పుంగనూరు, జనవరి 27: పుంగనూరులో దాదాపు రూ.7కోట్లకు బోర్డు తిప్పేసిన లిల్లీ ఇన్వెస్ట్‌మెంట్ లోన్ యాప్ కంపెనీలో డబ్బు కట్టిన బాధితులంతా పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే యాప్ కంపెనీ ప్రథమ ఏజెంట్, పుంగనూరుకు చెందిన నౌహీరాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఆ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దాంతో బాధితులంతా పోలీస్‌స్టేషన్‌కి వస్తున్నారు. ఎలాగైనా తమ డబ్బులిప్పించాలని పోలీసులను వేడుకుంటున్నారు.

## 29న ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు

తిరుపతి(విద్య), జనవరి 27: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తత్కాల్ స్కీమ్ ఫీజు గడువు ఈ నెల 29వ తేదీతో ముగుస్తుందని ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో ఇంటర్మీడియట్ కోర్సులు చదివే రెగ్యులర్, అనుత్తీర్ణులైన విద్యార్థులు రూ.3వేల అపరాధ రుసుంతో ఈ నెల 29న సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే వెసులుబాటు ఉందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 71,664 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,330 మంది తలనీలాలు సమర్పించారు.

## 'రా.. కదలిరా' కోసం..

కల్లూరు/రొంపిచెర్ల, జనవరి 27: పీలేరులో శనివారం నిర్వహించిన రా... కదలిరా చంద్రబాబు బహిరంగ సభకు పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పులిచెర్లలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు టీడీపీ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. రొంపిచెర్ల క్రాస్ మీదుగా పీలేరు సభకు వీరు తరలివెళ్లారు.



రొంపిచెర్ల నుంచి పీలేరుకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీ

## తిరుపతి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా నీహారిక?



తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారిక పేరు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈమె సత్యవేడు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తలారి మనోహర్ చిన్న కోడలు కూడా. నిజానికి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేరునే పరిశీలించారని, అయితే ఆమె ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని, తన భర్తకు అసెంబ్లీ టికెట్ కోరుతున్నారని సమాచారం. దీంతో ప్రత్యామ్నాయం గా పలు పేర్లను పరిశీలించారు. ఈ క్రమంలోనే గత తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె నీహారిక పేరు టీడీపీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమె టీడీపీ తొలితరం రాజ్యసభ సభ్యుడు, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు. మనోహర్ పెద్ద కుమారుడు తలారి ఆదిత్య 2014-19 నడుమ సత్యవేడు ఎమ్మెల్యేగా టీడీపీ నుంచీ గెలిచిన సంగతి తెలిసిందే. విద్యాధికురాలైన యువతి కావడం, తల్లి సీనియర్ బ్యూరోక్రాట్‌గా పనిచేసివుండడం, భర్త వైపు నుంచీ మామ, బావ ఎంపీ, ఎమ్మెల్యేలుగా పనిచేసివుండడంతో ఆమె తిరుపతి ఎంపీ స్థానానికి దీటైన అభ్యర్థి కాగలదని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీకి సాంప్రదాయకంగా వున్న బలానికి తోడు పొత్తు కారణంగా జనసేన మద్దతు అదనపు బలం కానుంది. నీహారిక అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

## 16న రథసప్తమి

**ఒకేరోజు ఏడు వాహనాలపై శ్రీవారి దర్శనం**

తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా వచ్చేనెల 16న తిరుమలలో రథసప్తమి జరగనుంది. ఒకేరోజు శ్రీవారు ఏడు వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు. వేకువజాము సూర్యప్రభ వాహనంతో రథసప్తమి వేడుకలు మొదలవుతాయి. తర్వాత చిన్నశేషవాహనం, గరుడవాహనం, హనుమంతవాహనం, చక్రస్నానం, కల్పవృక్షవాహనం, సర్వభూపాల వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంతో వేడుకలు ముగుస్తాయి. అలాగే ఫిబ్రవరి నెలలో 9వ తేదీన పురందరదాసుల ఆరాధనోత్సవం, 10న తిరుకచ్చినంబి ఉత్సవారంభం, 14న వసంతపంచమి, 19న తిరుకచ్చినంబి శాత్తుమొర, 20న భీష్మ ఏకాదశి, 21న కులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 24న కుమారధార తీర్థ ముక్కోటి, మాఘ పౌర్ణమి గరుడసేవ ఉత్సవాలు జరగనున్నాయి.

## ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : టీటీడీ శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ) ట్రస్టుకు శనివారం రూ.20 లక్షలు విరాళంగా అందింది. అమెరికాలో నివాసముంటున్న ఎన్‌ఆర్‌ఐ భక్తుడు చంద్రశేఖర్ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. తమ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్రతో కలిసి తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి చెక్‌ను అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సుధాకర్, కృష్ణారావు, లక్ష్మీబాయ్ కూడా ఎస్వీబీసీ ట్రస్టుకు మరో రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. విరాళం చెక్‌ను తిరుమలలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

## ఉద్యోగం చేయొద్దన్నందుకు వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన జ్యోతిక

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 : ఉద్యోగం చేయొద్దన్నందుకు ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి అశోక్‌నగర్‌కు చెందిన ధనరాజ్ సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన జ్యోతిక (23)తో సంవత్సరం క్రితం వివాహమైంది. బీటెక్ చదివిన జ్యోతికకు ఉద్యోగం చేయడమంటే ఇష్టం. తాను కూడా ఉద్యోగం చేస్తానని నిత్యం అడుగుతుండేది. ఆ ప్రతిపాదనను భర్త తిరస్కరించేవాడు. ఇదే విషయమై శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన జ్యోతిక భర్త స్నానం చేసి వచ్చే లోపల గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పీలేరు సభకు పోటెత్తిన జనం

● రా..కదలిరా.. సభకు మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు



మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఆధ్వర్యంలో పీలేరుకు తరలివెళుతున్న టీడీపీ నాయకులు



మదనపల్లె టీడీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



సభకు తరలిన తెలుగు యువత నాయకులు



గుర్రంకొండ నుంచి బయలుదేరిన టీడీపీ శ్రేణులు

మదనపల్లె/ టౌన్, జనవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పీలేరులో పాల్గొన్న రా..కదలిరా బహిరంగ సభకు జనం పోటెత్తారు. మదనపల్లె నుంచి చంద్రదండులా పెద్దసంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. స్థానిక అన్నమయ్యసర్కిల్ నుంచి మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, టిప్పుసుల్తాన్ మైదానం నుంచి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వందలాది వాహనాల్లో కార్యకర్తలను పీలేరుకు తరలించారు. టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 40 గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పీలేరుకు వెళ్లారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు పీలేరు వెళ్లారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ నుంచి అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, టీడీపీ నేత కొడికండ్ల అమరనాథ్, మైనారిటీ నేత ఎస్‌ఏ మస్తాన్ ఆధ్వర్యంలో వాహనాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని నిమ్మనపల్లె, మదనపల్లె, రామసముద్రం మండలాల నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. రా..కదలిరా..కార్యక్రమానికి మదనపల్లె జనసేన నేతలు వాహనాల్లో తరలి వెళ్లారు.జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు వేర్వేరుగా పార్టీ నేతలు, కార్యకర్తలతో వెళ్లారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనితలు..ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

**వాల్మీకిపురంలో:** రా.. కదలి రా..! బహిరంగ సభకు వాల్మీకిపురం మండలం నుంచి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్య కర్తలు వందలాది వాహనాలలో తరలి వెళ్లారు. ఈసందర్భంగా పట్ట ణంలో భారీ బాణా సంచా కాల్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పీలేరు సభకు తరలివెళ్లారు. వాల్మీకి పురం నుంచి చింతపర్తి వరకు వందలాది వాహనాలు జాతీయ రహ దారిపై ఎనిమిది కిలోమీటర్ల నిలిచిపోయాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు పీవీ నారాయణ, పులి సత్యారెడ్డి, చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, స్వర్ణలత, బార్ సెక్రటరీ రమణ, కాంతరాజు, సుధాకర్‌రెడ్డి, గుడ్రెడ్డి చంద్రారెడ్డి, కేవీ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డిష్ బ్రదర్స్, కువైట్ సయ్యద్‌బాషా, హరినాథరెడ్డి, రాజేంద్రాచారి, మురళి, ఆనంద్, హనీఫ్, సైదు, గాంధీపేట రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, జయకృష్ణ, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, బూత్ కన్వీనర్లు, పాల్గొన్నారు.

**నిమ్మనపల్లిలో:** టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీలేరులో నిర్వహించిన రా..కదలిరా..మహసభకు శనివారం టీడీపీ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు ఆలయం వద్ద పూజలు నిర్వహించి బాణాసంచా పేల్చుతూ చంద్రబాబు సీఎం కావాలని నినాదాలు చేశారు. దాదాపు 5వేలకు పైగా కార్యకర్తలు, ప్రజలు, నాయకులు చంద్రబాబు సభకు బయలుదేరి వెళ్లారు. వీరితో పాటుగా జనసేన నాయకులు, కార్యక్తలు సభకు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, భవాని ప్రసాద్, మునిరత్న, లక్షన్న, మల్లప్ప, ఆర్వే వెంకటేష్, మధుబాబు మల్లికార్జున, చినబాబు శంకర, మురళి, రాజశేఖర్, విజయ్, గోపి, కేశవ, చంద్ర, సూర్యప్రకాశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

**గుర్రంకొండలో:**తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పీలేరు నియోజకవర్గంలో నిర్వహించిన రా.. కదలిరా.. కార్యక్రమానికి గుర్రంకొండ మండలం నుంచి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఇందులో భాగంగా కార్లు, ద్విచక్ర వాహనాల్లో బస్టాండులో ర్యాలీ నిర్వహించి సభకు సుమారు 500 కార్లు, వెయ్యికిపైగా ద్విచక్ర వాహనాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

**ములకలచెరువులో:** పీలేరులో జరిగిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన రా..కదిరిరా భారీ బహిరంగ సభకు తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున టీడీపీ దండు తరలివెళ్లింది. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు, ప్రజలు వాహనాలలో బయలుదేరి వెళ్లారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత, ప్రముఖ పారిశ్రామితక వేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డిల అధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. పీలేరులోని హెలీప్యాడ్ వద్ద మాజీ ఎమ్మెల్యే శంకర్ చంద్రబాబుకు స్వాగతం పలికారు. అలాగే టీడీపీ నేత జయచంద్రారెడ్డి చంద్రబాబుకు భారీ గజమాల వేశారు. తంబళ్ళపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు పీలేరుకు భారీగా తరలివెళ్లారు.

**కురబలకోటలో:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పీలేరులో నిర్వహించిన రా..కదిలి రా.. సభకు తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు వి.సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వైజీసురేంద్రయాదవ్ రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బా షా, పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సదాశివ, మాజీ ఎం పీపీ తిమ్మరాయుడు, భూమిరెడ్డి, వెంకటరమణారెడ్డి, రామచంద్ర, మోహన్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, మునింద్ర, తెట్టు ఉపసర్పంచ్ బి.భాస్కర్ పాల్గొన్నారు.

**కలికిరిలో:**పీలేరులో జరిగిన చంద్రబాబు సభకు కలికిరి నుంచి వేలాది వాహనాల్లో జనాలు తరలి వెళ్లారు. కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణం నుంచి బయలు దేరిన అసంఖ్యాక వాహనాల కారణంగా క్రాస్ రోడ్డులో గంటలసేపు ట్రాఫిక్ స్తంభించింది. కొటాల, మేడికుర్తి, మహల్, పల్లవోలు, మునేళ్లపల్లె, మర్రికుంటపల్లె తదితర గ్రామాల నుంచి వేల సంఖ్య కార్యకర్తలు అత్యుత్సాహంతో బయలు దేరారు. సభను కిశోర్‌కుమార్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

**కలకడలో:**పీలేరులో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొన్న రా.. కదలిరా కార్యక్రమానికి కలకడ టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు సమావేశం వద్దకు చేరుకొన్నారు. నాయకులు ప్రసంగాలను ఆద్యాంతం ఆసక్తిగా విన్నారు.

**తంబళ్లపల్లెలో:** పీలేరులో శనివారం జరిగిన రా..కదలిరా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో తంబళ్లపల్లె మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు జీపులు, సుమోలు, కార్లు, బస్సుల్లో ఉత్సాహంగా పీలేరుకు తరలివెళ్లారు. అదేవిధంగా తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ నేత దాసరి పల్లె జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జీపులు, కార్లు, సుమోలు, బస్సుల్లో భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లారు.

**బి.కొత్తకోటలో:** టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం పీలేరులో నిర్వహించిన రా..కదలిరా. బహిరంగ సభకు బి.కొత్తకోట నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బి.కొత్తకోట నగర పంచాయతీతో పాటు మండల వ్యాప్తంగా గుమ్మసముద్రం, బడికాయపల్లె, బీరంగి, గట్టు గ్రామాల నుంచి సుమారు 150 వాహనాలలో కార్యకర్తలు తరలి వెళ్లారు. నియోజకవర్గ పోల్ కో ఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, దేవరింటి కుమార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జై చంద్రబాబు, జై శంకర్ నినాదాలతో వాహనాలలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

**పెద్దమండ్యంలో:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన తెలుగుదేశం పిలుస్తోంది రా..కదిలి రా బహిరంగ సభకు పెద్దమండ్యం మండలం టీడీపీ శ్రేణులు బసులు, కార్లు, జీపుల్లో భారీగా తరలి వెళ్లారు. చంద్రబాబు నాయుడు సభకు జనం భారీగా వెళ్లి విజయవంతం చేయడంతో టీడీపీ నేతలు, కార్యకర్తల్లో నూతనోత్సహం తెచ్చిందని టీడీపీ నేతలు తెలిపారు. వచ్చే ఎన్నికలల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు నాయుడును సీఎం చేస్తామని వారుతెలిపారు.

**పెద్దతిప్పసముద్రంలో:** టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం పీలేరులో నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభకు పీటీఎం మండలం నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. టి.సదుం, పీటీఎం, రంగసముద్రం, కందుకూరు, కాట్నగల్లు తుమ్మరకుంట గ్రామాల నుంచి సుమారు 150 వాహనాలలో టీడీపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు. వాహనాలకు టీడీపీ జెండాలను కట్టుకుని ర్యాలీగా పీలేరుకు బయలే దేరి వెళ్లారు.



బి.కొత్తకోట నుంచి బయలుదేరిన శంకర్‌యాదవ్, నాయకులు



వాల్మీకిపురం నుంచి తరలివెళ్తున్న టీడీపీ, జనసేన నాయకులు



పెద్దమండ్యం నుంచి తరలిన టీడీపీ నేతలు



**ములకలచెరువు:** చంద్రబాబుకు గజమాల వేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి



తంబళ్లపల్లె నుంచి తరలిన నేతలు





సభకు బయలుదేరిన జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి,శ్రీరామ రామాంజనేయులు



కలకడ నుంచి తరలిన నేతలు

## ఎన్‌టీఆర్ ట్రస్టు సేవలో 'పునీతుడు'

● దగ్గుబాటి కుమారుడి తొలి జీతం విరాళం



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దగ్గుబాటి పునీత్

కలికిరి, జనవరి 27: పీలేరు నియోజకవర్గం టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు కుమారుడు దగ్గుబాటి పునీత్ తన తొలి వేతనాన్ని ఎన్‌టీఆర్ ట్రస్టుకు విరాళంగా అందజేశారు. శనివారం పీలేరులో జరిగిన రా.. కదలి రా.. సభలో ఆయన నేరుగా ఇందుకు సంబంధించిన చెక్కును చంద్రబాబు నాయుడుకు అందజేశారు. 2022 జూలై 7న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజంపేట పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షా సమావేశాల సందర్భంగా టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు తన కుమారుడు దగ్గుబాటి పునీత్‌ను పరిచయం చేశారు. ఇంజినీరింగ్ చదువుతున్నానని, ఉద్యోగంలో చేరగానే తన మొదటి నెల జీతాన్ని ఎన్‌టీఆర్ ట్రస్టుకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు పునీత్ చెప్పారు. ఆ సందర్భంలో పునీత్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ చంద్రబాబు అభినందించారు. అనుకున్నట్టుగానే పునీత్ గత డిసెంబరు నెలలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరాడు. జనవరిలో మొదటి జీతం తీసుకున్నాడు. కాకతాళీయంగా శనివారం పీలేరు సభకు చంద్రబాబు రానుండటంతో గతంలో ఇచ్చిన హామీ మేరకు మొదటి నెల జీతం మొత్తానికి ఎన్‌టీఆర్ ట్రస్టు పేరు మీద వ్రాసిన రూ. 1,10,000ల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ యువనాయకుడు నల్లారి అమరనాథ రెడ్డి, తండ్రి వెంకటేశ్వర రావుల సమక్షంలో వేదికపైన చెక్కును అందుకున్న చంద్రబాబు ఒకింత ఆశ్యర్యం వ్యక్తం చేసి ఆ వెంటనే మాట నిలుపుకున్నందుకు అభినందించారు. ఉజ్వల భవిషత్తు లభించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కూడా పునీత్‌ను అభినందించారు.

## చంద్రబాబు హామీతో టమోటా రైతుల్లో హర్షం

గుర్రంకొండ, జనవరి 27:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు టమోటా రైతులకు జాక్‌పాట్ విధానం రద్దు చేసి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు. రా.. కదలిరా కార్యక్రమంలో భాగంగా శనివారం పీలేరు నిర్వహించిన సభలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గ సమస్యలను గుర్తు చేశారు. ఇందులో భాగంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లెతోపాటు పడమటి మండలాల రైతులు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తారని పంటకు ఎప్పుడు ధరలుంటాయో తెలియని దుర్భరస్థితి నెలకొందన్నారు. ఇందుకు గాను నియోజకవర్గంలో రైతుల సంక్షేమం కోసం టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తామన్నారు. అలాగే మార్కెట్ యార్డులో రైతులను వ్యాపారులు జాక్‌పాట్ విధానంతో దోచుకొంటున్నారని ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి రైతులను ఆదుకొంటానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గుర్రంకొండ, మదనపల్లె మార్కెట్‌లో జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

## చంద్రబాబు సభలో రాటకొండ బాబురెడ్డి



చంద్రబాబు వీడ్కోలు చెబుతుండగా మొదటి వరుసలోనే నిల్చున్న రాటకొండ బాబురెడ్డి

మదనపల్లె టౌన్, జనవరి 27: పీలేరులో శనివారం నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభలో మదనపల్లె మాజీ ఎమ్మెల్యే రాటకొండ శోభ భర్త, టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డికి ప్రాధాన్యత లభించింది. చంద్రబాబు ప్రసంగి స్తున్న వేదికపై మొదటి వరుసలోనే బాబురెడ్డికి స్థానం దక్కింది. అంతే కాకుండా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలసిన బాబురెడ్డిని టీడీపీ అధినేత ఆప్యా యంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు రాటకొండ హర్షవర్ధన్‌రెడ్డి, రాటకొండ విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు కేటాయించిన స్థలాన్ని కాపాడండి



నిరసన దీక్ష చేస్తున్న అనాథాశ్రమ చిన్నారులు, బహుజనసేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 27: అనాథ పిల్లల ఆశ్రమం కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడండి సార్..! అంటూ చైతన్య సర్వీసెస్ అనాథాశ్రమం పిల్లలు, ప్రజా సంఘాలు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో అనాథపిల్లలు నిరసన దీక్ష నిర్వహించారు. శ్రీచందు మాట్లాడుతూ బీకేపల్లె రెవెన్యూ గ్రామంలో ఇటీవల చైతన్య అనాథశ్రమానికి 20 కుంటల స్థలాన్ని సర్వే చేసి రెవెన్యూ అధికారులు చూపించారన్నారు. ఈ స్థలం చుట్టూ చైతన్య అనాథాశ్రమం నిర్వాహకులు కంచె ఏర్పాటు చేసుకోగా, కొందరు వ్యక్తులు వచ్చి కంచెను ధ్వంసం చేశారన్నారు. దీని సమస్య పరిష్కరించేంత వరకు నిరసన దీక్షలు కొనసాగిస్తామని శ్రీచందు పేర్కొన్నారు. వారి దీక్షకు మహాకార్య ఫౌండేషన్ అధ్యక్షురాలు పూర్ణిమ, మోహన్, కొండుపల్లె ఆనంద్, ఆటో యూనియన్ నాయకులు రాఘవేంద్ర, నవీన్, శివరామ్ తదితరులు మద్దతు తెలిపారు.

## చేనేత కార్మికుల ఇళ్ల స్థలాలు ఆక్రమణ

● సబ్‌కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా



సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

మదనపల్లె టౌన్, జనవరి 27: మదనపల్లె పట్టణ బైపాస్‌రోడ్డు పక్కన చేనేత కార్మికులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకుంటు న్నారని చేనేత కార్మికులు ఆరోపించారు. ఆమేరకు శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేతకార్మికులు మాట్లాడుతూ 2008లో పేదలైన తమకు ప్రభుత్వం బీకేపల్లె సర్వేనెంబర్ 552/8,9 సర్వే నెంబర్‌లో 96 మందికి 3.60 ఎకరాల భూమిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. ఆర్థిక స్థోమత లేక తాము ఇళ్లను కట్టుకోలేకపోయినా ఆ స్థలం చుట్టూ కంచె వేసుకున్నామన్నారు. కాని ఓ వ్యక్తి ఆ భూమిపై తనకు హక్కు ఉందని 2015లో హైకోర్టులో కేసు వేశారన్నారు. అప్పటి నుంచి కోర్టు వివాదంలో ఉన్న భూమి తమ స్వాధీనంలోనే వుండగా ఇటీవల ఓ వ్యక్తి అధికార పార్టీ పెద్దల పేర్లు చెప్పి ఆ భూమిని ఆక్రమించుకుంటున్నాడన్నారు. అనంతరం ఆర్డీవో మురళిని కలసి క్షేత్ర స్థాయిలో, రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

## ఓపీఎస్ సభకు వెళ్లకుండా ఉపాధ్యాయులకు నోటీసులు



యూటీఎఫ్ నేతకు నోటీసు ఇస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 27: రాజమండ్రిలో 28న నిర్వహిస్తున్న పాతపెన్షన్ మహాసభకు ప్రభుత్వ అనుమతులతో హాజరవుతున్న ఉపాధ్యాయులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ విషయమై యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురంవెంకటరమణ శనివారం మాట్లాడుతూ యూటీఎఫ్ ఓటుఫర్ ఓపీఎస్ నినాదంతో రాజమండ్రికి బయలుదేరిన ఉపాధ్యాయులకు సభకు హాజరు కాకుండా పోలీసులు నోటీసులు పంపడం దారుణమన్నారు. ఈ సంఘటననే మదనపల్లె డివిజన్ యూటీఎఫ్ ఖ ండిం చిందన్నారు. మదనపల్లె నుంచి సభకు హారవు తున్న యూటీఎఫ్ జిల్లాగౌరవాధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్య దర్శలు ఆదినారాయణ, రవిప్రకాష్, సుధాకర్‌లకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

## ఉత్తమ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మదనపల్లె అర్బన్, జనవరి27: చదువుల్లో ఉత్తమప్రతిభ కనపర్చిన విద్యార్థులకు రిటైర్డు ఉపాధ్యాయులు రంగనాథగుప్తా,సీహెచ్ వెంకటరత్నం శనివారం బహుమతులు ప్రదానం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కృష్ణారెడ్డి జూనియర్ కళాశాలలో వారికి బహుమతులు ప్రకటించి శనివారం అందజేశారు. వారి ఫిక్సడ్ డిపాజిటులోని రూ. రెండులక్షల నుంచి వచ్చిన వడ్డీని విద్యార్థులు హర్షిణిప్రియకు రూ.3వేలు, బి.మెర్లిన్ మండోనాకు, రూ.3వేలు, బి. జానకికి రూ.3వేలు,ఎస్ హరిషతకు రూ. రెండు వేలు, కె. చందుకు రెండు వేలు, వి.అనితాకు రెండు వేలు, విజయ్‌కుమార్‌కు వేయి అందజేశారు.

## జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలి

మదనపల్లె అర్బన్, జనవరి 27: ఏపీ రైతుసంఘం జిల్లా ప్రథమ మహాజభను విజయవంతంచేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక టమోటా మార్కెట్ యార్డులో ఏపీ రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యదర్శి పీఎల్‌నరసింహులు, జిల్లా రైతుసంఘం జిల్లాకార్యదర్శివంగమల్ల రంగారెడ్డిలు మాట్లాడుతూ ఏపీ రైతుసంఘం జిల్లా మహాసభలను ప్రప్రథమంగా రాయచోటిలో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## కులగణన సర్వేను బాధ్యతగా చేపట్టాలి

నిమ్మనపల్లి, జనవరి 27: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను సంబంధిత అధికారులు బాధ్యతగా చేపట్టాలని డీపీవో ధనలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె రాచవేటివారిపల్లి పంచాయతిలో జరుగుతన్న కులగణన సర్వేపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలసుకొన్నారు. అనంతరం ఆమె సచివాలయంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. అలాగే ఈ నెల 29వరకు గడువు పెంచారని ప్రజలు గైర్హాజరు కాకుండా అధికారులకు సహకరించాలన్నారు. సర్వేలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్ డీ చలపతిరావు, కార్యదర్శి మారెప్ప, సర్పంచ్ సుబ్రమణ్యం సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కలికిరి, జనవరి 27: మండలంలోని అద్దవారిపల్లె పంచాయతీ గుంటి వీరన్నపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.రామాంజులు (21) అనే యువకుడు మృతి చెందాడు. శనివారం గాలివీడు మండలం గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన రామాంజులుతోపాటు గణేష్ (22) అనే మరో యువకుడు కలిసి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కర్నూలు నుంచి కలికిరి వస్తున్న పాల ట్యాంకర్ ఢీకొనడంతో యువకులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఇద్దరినీ 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. తీవ్రంగా గాయపడిన రామాంజులు చికిత్స పొందుతూ మరణించాడు. మెరుగైన చికిత్స కోసం గణేశ్‌ను తిరుపతి తరలించారు. కలికిరి ఏఎస్‌ఐ మధుసూదనాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం- నలుగురు అరెస్టు

మదనపల్లె టౌన్, జనవరి 27: కురబలకోట మండలం అయ్యవారిచెరువు వద్ద ఎస్‌ఈబీ అధికారులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. శనివారం ఎస్‌ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ తెట్టు, పులుసుకుంట మార్గంలో తమ సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. అక్కడ కర్ణాటక మద్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న పులుసుకుంటకు చెందిన నారాయణ కుమారుడు టి.వీరభద్రుడు(35), కర్ణాటక రాష్ట్రం బాలేవారిపల్లెకు చెందిన రాజారెడ్డి(50), తెట్టు గ్రామానికి చెందిన గోపాలకృష్ణ(45), బి.చంద్ర(45)లను అరెస్టు చేశామన్నారు. పోలీసులను చూసి పారిపోయిన టి.చక్రవర్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. కాగా పొదల్లో 960 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

## టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

తంబళ్లపల్లె, జనవరి 27: రాబోయే ఎన్నికల్లో తంబ ళ్లపల్లెలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ రాజంపేట పార్ల మెంట్ ఉపాధ్యక్షుడు శివ కుమార్ అన్నారు. తంబళ్లపల్లె మండలం కొటాల శివ కుమార్‌ను టీడీపీ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను తంబళ్లపల్లె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. శివకుమార్ మాట్లాడుతూ...తనపై నమ్మకముంచి తనకీ బాధ్యతలప్పగించిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, చమర్తి జగన్మోహన్‌రాజుకు కతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, తెలుగు యువత నాయకులు నరసిం హులు, తంబళ్లపల్లె గ్రామాధ్యక్షుడు సాంబశివ, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, సోముశేఖర్, బీఎంఆర్‌రెడ్డప్ప, వెంకటరెడ్డి, మునాఫ్, శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చలపతినాయుడు, సుబ్రమణ్యం, శివ పాల్గొన్నారు.

## త్వరలో ప్రజారవాణా సంస్థకు 1500 బస్సులు

మదనపల్లె అర్బన్, జనవరి 27: ప్రజారవాణా సంస్థకు త్వరలో 1500 డీజల్‌బస్సులు, 1000 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నట్లు ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ వన్ డిపో కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం కార్గో ఆదాయం రూ. 200 కోట్లు సంపాదిస్తుందని, 2024-25 ఏడాదికల్లా రూ. 500కోట్లు కార్గో ఆదాయం పెంచడానికి ప్రణాళికతో పని చేయాలని సూచించారు. డిపోల్లో తల్తెతే సమస్యలను అప్పటికి అప్పుడే పరిష్కారం దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలను పరిష్కారం కొరకు ఎంప్లాయీస్, ఎన్‌ఎంయూ, వైఎస్ఆర్, బహుజన యూనియన్లు గుర్తింపు ఇచ్చారన్నారు. ముఖ్య పర్వదినాల్లో ప్రయాణి కులకు అధిక బారంలేకుండా సాధారణ చార్జీలతో ఆర్టీసీ సేవలను అందించిందన్నారు. వన్‌డిపో డీఎం మూరేవెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

## చింతచెట్టుపై నుంచి పడి వృద్ధుడు మృతి

తంబళ్లపల్లె, జనవరి 27: చింతచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి రెడ్డెప్పరెడ్డి(82) అనే వృద్ధుడు మృతి చెందిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో చోటు చేసుకుంది. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ కొండకింద మేకలవారిపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింత చెట్టులో కాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. గాయపడిన రెడ్డప్పరెడ్డిని కుటుంబసభ్యులు హుటాహుటిన తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్సలు కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

కలకడ, జనవరి 27:మండలంలోని ఎరువుల దుకాణాలను పీలేరు ఏడీఏ రమణరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్, ధర పట్టిక, ఎరువుల నిల్వలను పరిశీలించారు. దుకాణదారులు నిబం ధనల మేరకు విక్రయాలు జరపాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, సిబ్బంది శ్రావణ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డిలు పాల్గొన్నారు.